న్యూస్‌రీల్

జక్కంపూడి రాజాకు ఘనస్వాగతం



జక్కంపూడి రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కనపర్తి శేషారెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ఆదివారం కందుకూరు ఫ్లెఓవర్ వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కలిశారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి రాజాకు స్వాగతం పలికారు. ఆయన వెంట దారకానిపాడు వెళ్లారు. పార్టీ కొండపి మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు, జరుగుమల్లి మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, ఎం గంగాధర్, లింగాబత్తిన రాజా పాల్గొన్నారు.

దీపావళికి బీఎస్ఎన్ఎల్ డిస్కౌంట్ ఆఫర్లు

ఒంగోలు వన్‌టౌన్: దీపావళి సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లను అందిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ గుంటూరు మేనేజర్ ఎస్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన వినియోగదారుల కోసం రూ.1 రీచార్జి పథకంతో నెల రోజుల పాటూ అన్‌లిమిటెడ్ కాల్స్, 2 జీబీ హై స్పీడ్ డేటా అందిస్తున్నట్లు చెప్పారు. నేడు రూ.100ల పై రీచార్జి చేసుకుంటే లక్కీడ్రాలో అర్హత పొందుతారని, డ్రాలో 10 మందికి 10 గ్రాముల వెండి నాణేలు అందించనున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ ప్లాన్‌లో 1812లో అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటాను నవంబర్ 15 వరకూ రీచార్జి చేసుకునే వారికి అందించనున్నట్లు చెప్పారు.

పచ్చనేతలకు ప్యాకేజీ...

కరువు నేల రూపురేఖలు మార్చే వరప్రదాయిని అయిన వెలుగొండ ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉంటున్న ఊరిని వదిలి వెళ్లేందుకు వారంతా సిద్ధపడ్డారు. పుట్టిన గడ్డపై మమకారాన్ని చంపుకుని పది మంది మంచి కోసం వారు తమ భూములు, ఇళ్లు త్యాగం చేశారు. అటువంటి వారిని అన్ని విధాలా ఆదుకోవాల్సింది పోయి పచ్చ నేతలు తమ ధనదాహం తీర్చుకునేందుకు జలగల్లా పట్టి పీడిస్తున్నారు. అడిగినంత ముట్టచెబితేనే పరిహార ప్యాకేజీ ఇస్తామంటూ అడ్డగోలుగా వసూళ్ల పర్వానికి తెరతీశారు. అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై సాగిస్తున్న ఈ దందాపై నిర్వాసితులు భగ్గుమంటున్నారు.



- వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నష్ట పరిహారం ఇవ్వడంలో జాప్యం
- ప్యాకేజీ కావాలంటే ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు పచ్చనేతల వసూలు !
- అవినీతి పర్వానికి తెరలేపిన అధికారులు, టీడీపీ నేతలు
- రూ.కోట్లలో దండుకుంటున్నారంటున్న నిర్వాసితులు
- గెజిట్ ప్రకారం అందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- గతంలో వైఎస్సార్ చలువతోనే అన్నివర్గాలకు మేలు
- ప్యాకేజీ పెంచి అందరినీ సంతృప్తిపరిచిన వైఎస్ జగన్

యర్రగొండపాలెం: తీవ్ర కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రకాశంతోపాటు కడప, కర్నూలు జిల్లాల్లోని 30 మండలాల్లో ఉన్న సుమారు 16 లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచేందుకు పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, కంభం మండలంలోని కాకర్ల ప్రాంతాల్లో గ్యాప్‌లను నిర్మించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గ్యాప్‌లలో 11 గ్రామాలు ముంపునకు గురవుతాయి. వేలాది ఎకరాల పొలాలు ఆ గ్యాప్‌లలో కలిసిపోతాయి. ఆయా గ్రామాల్లో నివశించే ప్రజలు నిర్వాసితులుగా మారిపోయి తాము పుట్టిన గడ్డపై ఉన్న మమకారం, బంధాలను వదులుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా వారు నోచుకోని పరిస్థితి 2006 నుంచి ఏర్పడింది. అంతటి మహా త్యాగం చేసిన నిర్వాసితులు ఇప్పుడు టీడీపీ నాయకుల కబంద హస్తాల్లోకి వెళ్లాల్సి వచ్చింది. వారు చెప్పిందే వేదంగా వినాల్సిన పరిస్థితి వచ్చింది.

గతంలో నిర్వాసితుల సంక్షేమానికి పెద్దపీట:

20 ఏళ్ల క్రితం ఆనాటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో అన్ని వర్గాలకు చెందిన నిర్వాసితుల బాధలు తెలుసుకొని వారు తృప్తిపడేలా ఆయన ప్యాకేజీ ప్రకటించారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిర్వాసితులకు రూ.10 లక్షలుగా నష్టపరిహారం నిర్ణయించింది. ఈ పరిహారం సరిపోదని ప్రజలు చేసుకున్న విన్నపాలను ఆలకించి 2019లో అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రూ.12.50 లక్షలకు పెంచారు.

నేడు చేయి తడిపితేనే ప్యాకేజీ...

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్యాకేజీ పచ్చనేతలకు వరంగా మారింది. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి మార్కాపురం యూనిట్-1కు రూ.29.13 కోట్లు, కంభం యూనిట్-2కు రూ.35 కోట్ల ప్రకారం నిధులు విడుదలయ్యాయని ప్రచారంలో ఉంది. ఈ నిధులను కాజేసేందుకు టీడీపీ నాయకులు నిర్వాసితులను మభ్య పెడుతున్నారు. తక్షణమే ప్యాకేజీ వర్తింపచేస్తామని రూ.20 వేల ప్రకారం వసూలు చేయడం మొదలు పెట్టారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ముందుగా ఈ ప్రక్రియ మార్కాపురం యూనిట్-1లోని పెద్దారవీడు మండలం సుంకేసులలో ప్రారంభించినట్లు తెలుస్తోంది.

నష్టపరిహారం ఇవ్వడంలో జాప్యం:

ముంపు గ్రామాలకు ప్యాకేజీ ఇవ్వడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది తహసీల్దార్లను రంగంలోకి దింపింది. గడప గడపలో దర్యాప్తు జరిపి వారు గెజిట్‌ను రూపొందించారు. ఈ గెజిట్‌లో పుట్టిన బిడ్డ నుంచి 7 సంవత్సరాల వయస్సు ఉన్నవారి పేర్లు కూడా నమోదు చేశారు. ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నష్టపరిహారం రికార్డులను అధికారులు మూలన పడేశారు. ప్రస్తుతం ఆ గెజిట్‌లో నమోదైన వారందరూ 20 నుంచి 25 సంవత్సరాల వయస్సు దాటిన వారున్నారు. వీరికి కూడా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాల్సి వస్తుంది.

రూ.కోట్లు దండుకోవటానికి పథకం..

నిర్వాసితులను అడ్డుపెట్టుకొని రూ.కోట్లు దండుకోవటానికి పచ్చనేతలు పథకం వేశారు. ప్రభుత్వం తమదేనన్న అహంకారంతో వారు ఒక్కొక్క లబ్ధిదారుల నుంచి రూ.20 వేల ప్రకారం వసూలు చేస్తున్నట్లు సమాచారం. సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల పంచాయతీల్లో మొత్తం 10,252 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. వారిలో 3,760 కుటుంబాలు అవార్డ్ పొందాయి. 1,360 కుటుంబాలను పెండింగ్‌లో పెట్టారు. ఈ లెక్కల ప్రకారం పచ్చనేతలు రూ.కోట్లలో వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే గత వారం రోజులుగా దాదాపు 80 మంది నుంచి రూ.16 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఆయా గ్రామాలు ఉన్న లోయ ప్రాంతంలో అవినీతికి అధికారులు, పచ్చనేతలు తెరలేపారు. తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం కూడా డబ్బులు చెల్లించాల్సి రావడంతో టీడీపీకి చెందిన బలహీన వర్గాలు మండిపడుతున్నాయి.


“ మృతుల కుటుంబాలకు ప్యాకేజీ వర్తింపచేయాలి



అవార్డు పొంది మృతి చెందిన వారి కుటుంబాలకు కూడా ప్యాకేజీ వర్తింపచేయాలి. అటువంటివారు మా గ్రామంలో 90 కుటుంబాలు ఉన్నాయి. 20 ఏళ్ల క్రితం అవార్డు అయిన కుటుంబాల్లో మృతి చెందిన వారిని పక్కన పెట్టడం సరైంది కాదు. ఆ కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే వారికి సంబంధించిన ప్యాకేజీ కుటుంబంలో ఉన్న భార్యకు, భర్తకు, కుమారుడికి, తల్లిదండ్రులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలి. తమ పొలాలు, ఇళ్లు త్యాగం చేసి నష్టపరిహారం చేరేలోపు అనారోగ్యంతో మృతి చెందినవారి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే వారి కుటుంబాలను పరిగణనలోకి తీసుకోవాలి.

– కె.హనుమంతారెడ్డి, మాజీ సర్పంచ్, గుండంచెర్ల

“ గెజిట్‌లో ఉన్న వారందరికీ ప్యాకేజీ వర్తింపచేయాలి



గెజిట్‌లో నమోదు చేసిన వారందరికీ ప్యాకేజీ వర్తింపచేయాలి. 20 ఏళ్ల క్రితం బాల్యంలో ఉన్న తామందరికీ ఇప్పుడు 25 ఏళ్లు దాటాయి. నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ వస్తుంది. ఆ లెక్కల ప్రకారం గెజిట్‌లో ఉన్నా వారందరినీ పరిగణనలోకి తీసుకొని నష్టపరిహారం ఇవ్వాలి.

– యేర్వ ఆంజనేయులు, రైతు, సుంకేసుల

“ ప్యాకేజీ స్కాంను అడ్డుకుంటాం



పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల ప్యాకేజీ స్కాంను అడ్డుకుంటాం. అధికారం ఉందని టీడీపీ వర్గీయులు, ప్రాజెక్ట్ అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు చేయాలనుకుంటున్నారు. ప్యాకేజీ మంజూరు కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని, లేకుంటే ప్యాకేజీ నిలిపి వేయిస్తామని నిర్వాసితులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం కోట్ల రూపాయలు దండుకోవాలని కూటమి నాయకుడు పథకం వేశాడు. సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల పంచాయతీల్లో 1,360 కుటుంబాలను పెండింగ్‌లో పెట్టారు. వీరికి కూడా అవార్డు రావటానికి పచ్చనేతలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం గురించి కలెక్టర్, ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లాను. నిర్వాసితుల ప్యాకేజీ కోసం జిల్లా గవ్వ చెల్లించాల్సిన అవసరం లేదు. నిర్వాసితులందరికీ తక్షణమే ప్యాకేజీ వర్తింపచేయాలి. అధికారులు స్పందించి సమస్యను సరిదిద్దకుంటే తీవ్ర ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నాను.

– తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్యే, యర్రగొండపాలెం



వెలుగుల కేళి.. దీపావళి

ముంగిట ఎగసే తారాజువ్వల పతంగం
మది పొరలలో విరిసే ఆనందాల సంబరం
చీకట్లను పారదోలే వెలుగుల పర్వం
పాపాలను హరించే కాంతుల హారం
దీపావళి పర్వదినం అందరి కుటుంబాల్లో సంతోషాన్ని నింపాలి.

- సాక్షి, ఒంగోలు

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, కలెక్టర్ పి.రాజాబాబు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటేనే చీకటి పై వెలుగు.. చెడుపై మంచి.. అజ్ఞానం పై జ్ఞానం.. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు.

బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన పురుషుల జట్టు



ఎంపికైన మహిళల జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళ, పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు ఆదివారం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 40 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 12 మంది పురుషులు, 12 మంది మహిళలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్లు విశాఖపట్నంలో నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే 11వ సీనియర్ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలన్నారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు కూడా సాధించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మెంబర్ సయ్యద్ జిలాని బాషా, పీడీ యు.సుబ్రహ్మణ్య, పీడీ పోతురాజు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్, ఎస్పీ నిర్వహించే మీ కోసం రద్దు

ఒంగోలు సబర్బన్/ ఒంగోలు సిటీ: దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజైనందున సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పీ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించగలరని వారు కోరారు.

జిల్లా అనుబంధ విభాగ కమిటీల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన నాయకులను వివిధ హోదాల్లో అనుబంధ విభాగ కమిటీల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ ప్రెసిడెంట్‌గా మార్కాపురానికి చెందిన మల్లాపురం ఉత్తమ్‌కుమార్‌ను నియమించారు.

క్లుప్తంగా

రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం

● రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్



కూలిన విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ల సహాయంతో తొలగిస్తున్న అధికారులు

పీసీపల్లి: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అలవలపాడు సమీపంలో పాలేటిగంట ప్రాంతంలో విద్యుత్ స్తంభం కూలి కందుకూరు ప్రధాన రహదారిపై పడింది. దీంతో ఆదివారం ఉదయం కనిగిరి-కందుకూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖాధికారులు ట్రాక్టర్ల సాయంతో వాటిని తొలగించడంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.



కనిగిరి- కందుకూరు రహదారిపై ఆగిన ట్రాఫిక్

చెరువు భూములు చెరబట్టారు..!

అధికారం అండగా టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్లు ఆక్రమించేశారు. పశువుల పోరంబోకు, డొంకపోరంబోకు ఇలా... ఏ భూమినీ వదల్లేదు. ఇప్పుడు ఏకంగా చెరువు భూములపై కన్నేశారు. ఏం చేసినా అడిగేదెవరు అన్నట్లు చివరకు చెరువు భూములను వదలకుండా కబ్జా చేసి ఆక్రమించేశారు. కబ్జా విషయం అధికారులు తెలిసినా ఏం తెలియనట్లు చోద్యం చూస్తున్నారు.

- ● బింగినపల్లి చెరువుపై కన్నేసిన టీడీపీ నేత
- ● మండలంలో అతిపెద్దదైన బింగినపల్లి చెరువు
- ● చెరువు పరిధిలో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు
- ● సుమారు 50 ఎకరాల చెరువు ఆక్రమణకు యత్నం
- ● చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు
- ● చెరువును కాపాడాలంటున్న ఆయకట్టు రైతాంగం



బింగినపల్లి చెరువు స్థలాన్ని దున్నేసి జామాయిల్ మొక్కలు నాటిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్, ఒంగోలు: సింగరాయకొండ మండలంలో అతిపెద్దదైన మీడియం ఇరిగేషన్ చెరువు బింగినపల్లి చెరువు. సుమారు 650 ఎకరాల వైశ్యాలంలో చెరువు ఉంది. ఈ చెరువుకు అనుకుని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 331లో 109 ఎకరాల వైశాల్యంలో అనచెరువు, సర్వే నంబర్ 327,330లలో సుమారు 30 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయి. బింగినపల్లి చెరువు కింద సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, అనకట్ట చెరువు కింద సుమారు 100 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే బింగినపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత కన్ను ఈ చెరువుపై పడింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత సన్నెబోయిన మాలకొండయ్య, మరో వ్యక్తి కలిసి పాతసింగరాయకొండ సర్వే నంబర్ 327, 330లో సుమారు 20 ఎకరాల ఇనాం భూములకు రిజిష్టర్ డాక్యుమెంట్ ఉందని సాకు చూపి ఇనాం భూములు 20 ఎకరాలతో పాటు బింగినపల్లి చెరువులో సుమారు 50 ఎకరాలు దున్ని తరువాత జామాయిల్ మొక్కలు నాటే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీవాసులు మా భూములు ఆక్రమిస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ వెంటనే సిబ్బందిని పంపి టీడీపీ నేత మొక్కలు నాటడాన్ని ఆపించారు. దీంతో టీడీపీ నేత మాలకొండయ్య, అడ్వకేట్ రాజేష్‌తో పాటు పొలం హక్కుదారుడంటూ మక్కె కోటిరెడ్డి, మరొక వ్యక్తి వచ్చి తహశీల్దార్‌ను కలిసి రిజిష్టర్ పత్రాలు అందజేసారు. ఎస్సీలు మాత్రం అగ్రిమెంట్ పత్రాలు అందజేసారు.



దున్నేసిన బింగినపల్లి చెరువు

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు..

గత కొద్ది రోజులుగా బింగినపల్లి చెరువుతో పాటు పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అనచెరువు కూడా ఆక్రమణకు గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాక ఆక్రమణదారులు చెరువు స్థలాన్ని ఆక్రమించటంతో పాటు జామాయిల్ వేస్తున్నారని, దీంతో చెరువు కింద సాగు చేసుకునే ఆయకట్టు దారులైన వరిరైతులకు సాగునీటి కష్టాలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనచెరువు ఆయకట్టు సుమారు 109 ఎకరాల వైశాల్యం ఉంటే ప్రస్తుతం కేవలం సుమారు 40 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన స్థలం ఆక్రమణకు గురైందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు ఆక్రమణకు గురవుతున్నా బింగినపల్లి చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడు రోశిరెడ్డి కూడా పట్టించుకోలేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. మంత్రి స్వామి ఇలాకాలో ఇటువంటి ఆక్రమణలు జరగటం సిగ్గుచేటని, టీడీపీ నాయకుని భూ దాహానికి అంతేలేదా అని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ భూ బకాసరుడు పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రీయల్ స్థలంలో పంట కాలువ ఆక్రమించాడని, జీవీఆర్ ఫ్యాక్టరీ సమీపంలో భూమిని సైతం ఆక్రమించాడని, ఇప్పుడు చెరువును కూడా వదల్లేదని టీడీపీలోని మరో వర్గం ఆరోపిస్తోంది.



మంత్రి లోకేష్‌తో చెరువు ఆక్రమణకు పాల్పడిన టీడీపీ నేత సన్నెబోయిన మాలకొండయ్య

➤ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బింగినపల్లి చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా ఆయకట్టు రైతులు చర్యలు తీసుకున్నారు. చెరువుకు ఆనుకుని ఉన్న పాతసింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని భూములకు చెందినవారు సాగు పేరుతో ఏటా కొంతమేర చెరువుస్థలాన్ని ఆక్రమించేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఆక్రమించగా మిగిలిన స్థలాన్ని అయినా కాపాడాలని వారి పొలాలకు ఆనుకుని గుంట తీసి ఆ మట్టిని కట్టగా వేశారు. కానీ ప్రస్తుతం టీడీపీ టిడిపి నేత మాలకొండయ్య ఈ కట్టను ఆనుకుని అవతల పక్కన ఉన్న సుమారు 70 ఎకరాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడు. తాము ఎన్నో ఏళ్లుగా తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని కూడా దున్నేశారని పలువురు దళితులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి చెరువు స్థలం ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

బింగినపల్లి చెరువులో జామాయిల్ మొక్కలు నాటుతున్నారని తెలిసి సిబ్బందిని పంపించి ఆపించాను. తరువాత టీడీపీ నాయకుడు మాలకొండయ్య ఆ స్థలానికి రిజిష్టర్ డాక్యుమెంట్ ఉన్నాయని, స్థలం హక్కుదారుడంటూ మక్కె కోటిరెడ్డి అనే వ్యక్తిని తీసుకువచ్చారు. దీనిపై విచారణ చేస్తున్నాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం. చెరువు స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా కాపాడతాం.

– ఎస్‌వీబీ రాజేష్, తహసీల్దార్

రెండు ఎకరాల పొలాన్ని దున్నేశారు:



మా తాతల నాటి నుంచి ఎన్నో ఏళ్లుగా బింగినపల్లి చెరువు వద్ద 2 ఎకరాలు సాగు చేసుకుంటున్నాను. నా పొలాన్ని దున్నేశారని తోటి రైతులు చెప్పటంతో వచ్చి చూసుకుంటే నా స్థలాన్ని దున్నేశారు. అధికారులే న్యాయం చేయాలి.

– కొమరగిరి వరాస, ఎస్టీ కాలనీ, పాతసింగరాయకొండ

మెడికల్ కాలేజీలపై బాబు కుట్ర

- ● బినామీలకు దోచిపెట్టేందుకే ప్రైవేటీకరణ జపం
- ● మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు ధ్వజం



కోటిసంతకాల సేకరణలో పాల్గొన్న అన్నా రాంబాబు, నాయకులు

మార్కాపురం టౌన్: పేదలకు ఉచిత వైద్యం, విద్య అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కాలేజీలపై చంద్రబాబు కుట్ర పన్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ పట్టణంలోని 1,4, 10, 11 బ్లాకుల్లో ఆదివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. తొలుత తూర్పు వీధిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే 5 మెడికల్ కాలేజీలకు పీజు సీట్లు కూడా మంజూరు చేశారని, 2024లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే మిగిలిన కాలేజీలు కూడా పూర్తయ్యేవన్నారు. 70 శాతం పూర్తయిన కళాశాలలను శాతం ప్రైవేట్‌పరం చేయడం దుర్మార్గమన్నారు. పార్టీలకతీతంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాజెక్టును ప్రాముఖ్యను గుర్తించి రూ.3,500 కోట్లు మంజూరు చేశారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం ప్రాజెక్టుకు శిలాఫలకం వేసింది నేనేనంటూ, పూర్తిచేసేది కూడా నేనేనంటూ చెప్పుకోవడమే తప్ప చేసిందేమీ లేదన్నారు. కూటమి పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అన్నా కృష్ణచైతన్య, పార్టీ స్టేట్ కమిటీ సభ్యులు వెన్న హనుమారెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఉడుముల కోటిరెడ్డి,, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చర్లంచర్ల బాలమురళీకృష్ణ, డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, టౌన్‌పార్టీ ప్రెసిడెంట్ సలీమ్, సిరాజ్, పత్తి రవిచంద్ర, ఉత్తమ్‌కుమార్, రోజ్‌లిడియా, కొత్త కృష్ణ, గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, రంగస్వామి గౌడ్, చాటకొండ చంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి గొలమారి సత్యనారాయణరెడ్డి, గొలమారి శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కోటి సంతకాలు’ త్వరగా పూర్తి చేయాలి

● మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున



నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వమే నిర్మాణాలు పూర్తి చేసి నడిపేలా ఒత్తిడి తీసుకురావడానికి జగనన్న కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారన్నారు. మండల నాయకులు అందరూ వారి వారి గ్రామాల్లో కోటి సంతకాల కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేస్తే సంతకాలను కేంద్ర కార్యాలయానికి పంపించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలు

- ● పంది ఎదురురావడంతో తప్పించే క్రమంలో బోల్తా
- ● ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు, నరసరావుపేట తరలింపు



బోల్తా పడిన ఆటో



గాయపడిన భాగ్యలక్ష్మి , గోవర్థనరెడ్డి

దొనకొండ: ఆటో బోల్తా పడి ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కొచ్చర్లకోట గ్రామ సమీపంలో మార్కాపురం వెళ్లే రహదారిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి నారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబ సమేతంగా తిరుపతి దర్శనానికి వెళ్లారు. స్వామి దర్శనం తర్వాత నారపురెడ్డిపల్లి గ్రామానికి మార్కాపురం నుంచి ఆటో మాట్లాడుకొని వస్తున్నారు. ఆటో కొచ్చెర్లకోట గ్రామ సమీపంలోకి వచ్చ సరికి పంది ఎదురు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మి, అచ్చమ్మ, భాగ్యలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వారిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం భాగ్యలక్ష్మీ, శ్రీనివాసరెడ్డిని గుంటూరుకు తరలించగా మిగిలిన ముగ్గురిని నరసరావుపేటకు తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై టి.త్యాగరాజు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

ఒంగోలు సిటీ:

చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆనందంగా జరుపుకోవాలని, దీపావళి అందరి జీవితాల్లో నూతన వెలుగులు, శాంతి, సంతోషాలు నింపాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన, కాలుష్యరహిత టపాసులు కాల్చాలన్నారు. పిల్లలు టాపాసులు కాల్చేటప్పుడు తప్పకుండా పెద్దల పర్యవేక్షణ ఉండాలన్నారు. హాస్పిటల్ వద్ద బాణాసంచా కాల్చరాదని, ప్రజలకు, రోడ్డు వెంబడి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా టపాసులు కాల్చుకోవాలని సూచించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి హేయం



ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని నిలదీస్తున్న ‘సాక్షి’పై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి విచారణల పేరుతో వేధిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ప్రతిసారీ ఎక్కడో ఒక చోట సంబంధం లేని వ్యక్తులతో ఫిర్యాదుల చేయించి పోలీసులను ఉసిగొల్పుతోంది. పత్రికల గొంతు నొక్కి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయాలని కూటమి సర్కారు చేస్తున్న కుట్రలపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది.

– సాక్షి నెట్‌వర్క్

సాక్షి జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు మిగిలిన పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. పత్రికల్లో రాసిన వార్తల ఆధారంగా కేసులు నమోదు చేయడం సరికాదు. ఈ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ఇలా అయితే ప్రజాస్వామ్య మనుగడ కష్టం. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలి. అధికారంలో ఉన్న వారికి పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వొచ్చు కానీ, పోలీసులతో కేసులు పెట్టించ కూడదు. ప్రజలన్నీ గమనిస్తున్నారు.

– జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు, పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు

కక్షసాధింపు తగదు



సమాజంలో జరుగుతున్న వాస్తవాలను బయట పెడుతున్న పత్రికలపై కక్షసాధింపు తగదు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి, రిపోర్టర్లపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదు. కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలను వెలికి తీస్తే కక్ష సాధింపులకు పాల్పడడం మంచి పద్ధతి కాదు. ప్రజా పక్షాన నిలబడి నిజాన్ని నిర్భయంగా చెప్పేది ఒక సాక్షి పత్రిక మాత్రమే. ప్రభుత్వంలో అక్రమాలను వెలికితీస్తున్న జర్నలిస్టులు చేస్తున్న కృషిని అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు.

– ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ప్రకాశం జిల్లా

నియంతృత్వ పోకడలకు పరాకాష్ట



ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను వెలికితీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం అత్యంత దుర్మార్గం. రాష్ట్రంలో నకిలీ మద్యం పేరుతో కొనసాగుతున్న దోపిడీని బయటపెట్టినందుకు పత్రికను నిలువరించేందుకు నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్న ఈ కూటమి ప్రభుత్వం తీరు అత్యంత గర్హనీయం. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు.

– కేవీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం మానుకోవాలి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డికి నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి. జర్నలిస్టులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి. పత్రికల్లో వార్తలు రాశారని కేసులు నమోదు చేయడం అనైతికం. కూటమి ప్రభుత్వం బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదు.

– వై.వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా

సాక్షి జర్నలిస్టలపై కేసులు ఎత్తివేయాలి



సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయర్‌రెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన అక్రమకేసులను తక్షణం ఎత్తివేయాలి. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలి. పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వొచ్చు. కానీ పాత్రికేయుల ఇళ్లలో సోదాలు చేసి భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గం. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

-కల్లూరి రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ టీచర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు

దీపావళి మరిన్ని వెలుగులు నింపాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



అధికారులకు మిఠాయిలు పంచిపెడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: తగ్గిన జీఎస్టీ ధరలు ప్రజల జీవితాల్లో మరిన్ని దీపావళి వెలుగులు నింపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. ‘సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్’ ప్రచార ముగింపు కార్యక్రమం ఆదివారం ప్రకాశం భవనంలో నిర్వహించారు. జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, కమర్షియల్ ట్యాక్స్ అధికారి కొప్పోలు సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకే ట్రంప్ సుంకాలు



నిరసనలో మాట్లాడుతున్న నెరుసుల వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక రంగమైన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం మేర సుంకాలను విధించాడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు విమర్శించారు. ట్రంప్ విధించిన సుంకాలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలకు మన దేశ ప్రధాని సాగిలపడి దాసోహం చేస్తున్నాడని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ అమెరికా తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసమే సుంకాలను విధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా ఆయుధాలను మనదేశంలో దిగుమతి చేసుకోవాలని మోడీపై ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అనంతరం ట్రంప్ చిత్రపటానికి కొలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు నిప్పంటించారు. కార్యక్రమానికి రైతు సంఘం మండల కార్యదర్శి ఎన్వీ నరసింహం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కరిచేటి హనుమంతరావు, అన్నె వెంకటసుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం సుశీల, ఏ శేషారావు, గౌరవాధ్యక్షుడు ఈ సుబ్బారావు, సీఐటీయూ మండల కన్వీనర్ షేక్ మస్తాన్, ఐద్వా నాయకులు ఎన్ మాలతి, ఎస్‌కే నాగూర్ బీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.